

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త




## విభజన హామీల అమలు కోరుతూ రొట్టె పట్టుకున్న ఎమ్మెల్యే
### సామాన్య భక్తులతో కలిసి క్యూలో వెళ్లిన కోటంరెడ్డి





**నెల్లూరుటౌన్, ఆగస్టు 11 ప్రభాతవార్త** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు నెరవేరాలని, అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యేలా, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కష్టాలను అధిగమించాలని కోరుతూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రొట్టెపట్టుకున్నారు. రొట్టెల పండుగ సంధర్భంగా మూడో రోజు స్వర్ణాల చెరువు నందు రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్. సైదాని చేతుల మీదుగా రొట్టెను పటుకుని, భక్తులతో కలిసి సాధరణ క్యూలైన్‌లో నిలబడి దర్గాలోని బారాషాహీద్లను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక ఇబ్బందుల్లో ఉన్నా, సమస్యలు ఉన్నా, ఆర్థిక పరిస్థితులు ఉన్నా ఇచ్చిన మాట తప్పకుండా సమర్ధవంతంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలవాలని, విభజన నాటి హామీలు వెంటనే నెరవేర్చాలని, పోలవరం పూర్తిచేయాలని, అన్నింటికి మించి కష్టకాలంలో సైతం ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు నడిపిస్తున్న వైయస్. జగన్‌మోహన్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని బారాషాహీద్‌ను ప్రార్ధిస్తూ స్వర్ణాల చెరువు నందు రొట్టె పట్టుకోవడం జరిగింది. ఈసంధర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయం అట్టక్ నుండి కట్టక్ వరకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చరిత్రలో ఎక్కడా ఏ రాష్ట్రానికి జరగలేదన్నారు. అంతటి అన్యాయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిందన్నారు. అందుకే ఇన్ని కష్టాలలో కూడా ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి తన సమర్ధవంతంగా రాజకీయంతో ఆంధ్రప్రదేశ్‌ని అన్ని రకాలుగా ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను ఈదేశమే నివ్వెరపోయే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ముందుకు నడిపిస్తున్నారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయ సహకారాలు అందిసవ్తున్న జిల్లా కలెక్టర చక్రధర్‌బాబు, ఎస్పి. విజయకుమార్, నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ డి. హరితలకు దన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట 35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి వాసంతి, ముస్లిం మతపెద్దలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలువురు ఎంపీడీఓలకు పదోన్నతి

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11 ప్రభాతవార్త** జిల్లాలోని పలువురు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు (ఎంపీడీఓలు) పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని 8 మంది ఎంపీడీఓలకు పదోన్నతి కల్పించడంతోపాటు జిల్లాతోపాటు ఇతర జిల్లాలలో నియమించారు. అదేవిధంగా ఇతర జిల్లాలలో ఎంపీడీఓలుగా పనిచేస్తున్న వారికి జిల్లాలో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో భాగంగా విడవలూరు ఎంపీడీఓ బి. చిరంజీవి నెల్లూరు జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓగా, అల్లూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న టి. వసుంధరను నెల్లూరుజిల్లా డ్వామాలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరక్టర్‌గా (అకౌంట్స్)గా, దగదర్తి ఎంపీడీఓ బి. వసుమతిని ప్రకాశం జిల్లా పొదిలి డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరక్టర్‌గా, కొండాపురం ఎంపీడీఓ ఎస్. జయసింహను కడపజిల్లా చేవూరు డ్వామా కస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరక్టర్‌గా, బోగోలు ఎంపీడీఓ జి. నాసరరెడ్డిని కర్నూరు జిల్లా పరిషత్ సీఈఓగా, ఆత్మకూరు ఎంపీడీఓ వీవీశేషయ్యను కడపజిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా, సైదాపురం ఎంపీడీఓ ఈ. వాణిని గూడూరు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, సంగం ఎంపీడీఓ పి. సుజాతను ప్రకాశంజిల్లా కనిగిరి క్లస్టర్ డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరక్టర్‌గా, చిట్టమూరు ఎంపీడీఓ సురేష్‌బాబును నెల్లూరుజిల్లా డ్వామా విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమించారు. ఇక గుంటూరుజిల్లా పొన్నూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న టి. సుధారాణికి పదోన్నతి కల్పించి నెల్లూరుజిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా నియమించారు.

## 18 నుంచి భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



**వెంకటాచలం, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు భగవాన్ వెంకయ్యస్వామి 40వ ఆరాధన మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గొలగమూడిలోని ఆశ్రమ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆరాధన ఉత్సవాల వివరాలు వెల్లడించారు. గత రెండేళ్లుగా కోవిడ్ కారణంగా ఆరాధన ఉత్సవాలు నిర్వహించలేదని, ఈ ఏడాది ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. వసతి గృహాలు, తాగునీరు, కళ్యాణ మండపాలు అన్ని సిద్ధం చేశారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చి కనుపూరు కాలువ నుంచి గొట్లపాళెం మీదుగా గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధన ఉత్సవాలకు తాగునీటిని అందిస్తున్నారు. దీంతో మంత్రి కాకాణికి ఆశ్రమ కమిటీ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నదానం సంబంధించి అదనంగా పాత హాలుతో పాటు దానిపై కొత్తది ఏర్పాటు చేశామన్నారు. 215 వసతి గృహాలు, మరుగుదొడ్లు అన్నీ సిద్ధం చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు, 24వ తేది ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశామన్నారు.

## అభివృద్ధి సంక్షేమమే వై.సి.పి లక్ష్యం




**ముత్తుకూరు, ఆగస్టు11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజల ఆభివృద్ధి సంక్షేమమే వై.కా.పా ప్రభుత్వ అక్ష్యమని వ్యవసాయశాఖా మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి అన్నారు. గురువారం ముత్తుకూరు మండలం లోని దొరువులపాళెం పంచాయతీలోని ఈపూరు వెంకన్నపాళెం గ్రామంలో వై.సి.పి సీనియర్‌నాయకులు దువ్వూరు, విశ్వమోహనరెడ్డి, దువ్వూరు నిరంజనరెడ్డి, మండల యూత్ అద్యక్షులు దువ్వూరు తేజారెడ్డి వ్యవసాయ శాఖా మంత్రికి అపురూప స్వాగతం పలికారు. గడప గడపకు వెళ్ళి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాతూ పార్టీలకతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి మూడుసంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగంగా గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విదంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సచివాలయ వ్యవస్తను సి.ఎం ఏర్పాటు చేయడంతో ఆయాగ్రామలలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు శ్రీకారంచుట్టామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టాయన్నారు. గ్రామాలలో ఎక్కడికి వెళ్ళినాసరే సిమెంటురోడ్లు, డ్రైనేజ్‌లు పూర్తిచేశామన్నారు. ఈకార్యక్రమంలో మండలకన్వీనర్ మెట్టా విష్ణువర్తనరెడ్డి, ఎం.పి.పి గండవరము సుగుణ, నెల్లూరు. శివప్రసాద్, ఇసనాక. చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ మీదూరు. సునందనమ్మ, ఉపసర్పంచ్ పద్రి. రత్నం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి



**కోవూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిందో ఆ ఉద్దేశాన్ని నూరుశాతం అమలు చేసేలా సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో విధులను చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలు అందేలా దృష్టి పెట్టాలన్నారు. అదే సమయంలో స్పందనకు వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపించేలా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. గ్రామ సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు లేని విషయమై ఆయన సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ప్రతి ఎనర్జీ అసిస్టెంట్ తప్పనిసరిగా గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి ప్రత్యేకంగా గ్రామ సచివాలయాలకు సంబంధించి ఏర్పాటు చేసిన మ్యాప్‌ను జేసీ పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. తహసీల్దార్ పద్మజ, ఆర్ఐలు రాకేష్, రమణయ్య, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డిలు ఉన్నారు.

## వైభవంగా గంధమహోత్సవం







**నెల్లూరుటౌన్, ఆగస్టు 11 ప్రభాతవార్త** నెల్లూరు బారాషాహీద్ దర్గాలో మూడో రోజు ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. బుధవారం రాత్రి గంధమహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు జాగారం చేసి గురువారం ఉదయం స్వర్ణాల చెరువులో స్నానమాచరించి బారాషాహీద్ దర్గాలను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. నగరంలోని కోటమిట్ట ఎనీమియా మసీదు నుంచి 12బిందెలతో వూరేగింపుగా ప్రత్యేక వాహనంలో బారా షహీద్ దర్గా వద్దకు తీసుకువచ్చారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి సయ్యద్ ఆరిఫుల్ల పర్యవేక్షణలో గంధాన్ని వివిధ రకాల సుంగంధ ద్రవ్యాలు కలిపి పన్నెండు బిందెల్లో నింపారు. అనంతరం మజావర్లు వీటిని భక్తిగీతాలను ఆలపిస్తూ ఉండగా బాజా, భజంత్రీలు, మేళతాళాలు మ్రోగిస్తుండగా పెద్ద ఎత్తున టపాకాయాలు దారి పొడవునా కాలుస్తూ దర్గా ప్రసాదాన్ని తీసుకొచ్చి ప్రత్యేకప్రార్ధనలు అనంతరం గంధాన్ని మృతవీరుల సమాధులకు లేపనం చేసి గురువారం తెల్లవారు జామున భక్తులకు పంపిణీ చేశారు. గంధం తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఎగబడ్డారు. దర్గా ఆవరణలో జరిగిన తొక్కిసలాటలో కొంతమందికి స్వల్పగాయాలయ్యాయి. గంధమహోత్సవ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు, కమిషనర్ హరిత, డీపీఓ ధనలక్ష్మీ దర్గాను సందర్శించారు. ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.





## కసుమూరు దర్గా వసతిగృహానికి శంకుస్థాపన



**వెంకటాచలం, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రూ.2.65 కోట్లతో నిర్మిస్తున్న భక్తుల వసతి డార్మెంటరీ వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గూడూరు శాసనసభ్యులు వరప్రసాద్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఖాదర్‌బాషాతో కలిసి గురువారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు ఎక్కువ సంఖ్యలో భక్తులు రావడంతో భక్తులకు వసతి లేనందు వలన అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే రూ.2.65 కోట్లతో వసతి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారన్నారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి వచ్చే భక్తులకు వసతి గదులను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డ్ శాఖ అధికారులకు, మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 2.6 ఎకరాల స్థలంలో వసతి సౌకర్యం నిమిత్తం నిర్మిస్తున్న వసతిగృహాలు 23 నిర్మించడంతో పాటు మహిళలకు, పురుషులకు వేర్వేరుగా డార్మెంటరీని నిర్మించడం జరుగుతుందన్నారు. దర్గా అభివృద్ధికి మరింత దృష్టి సారించి పూర్తి స్థాయిలో భక్తులకు అవసరమైన వసతులను కల్పిస్తామన్నారు. ఈ వసతి నిర్మాణాల వలన గ్రామాలు చిరకాల కోరికను నెరవేరుతుందని తెలిపారు. తొలుత అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కసుమూరు గ్రామస్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అనేక కార్యక్రమాలు జరుపుకుంటున్నామన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది యోధులు ప్రాణాలు అర్పించడం జరిగిందన్నారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందా కవిత, మెప్మా పిడి రవీంద్ర, తహసీల్దారు నాగరాజు, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణ, కసుమూరు దర్గా కమిటీ సభ్యులు, ముజావరులు తదితరులు పాల్గొన్నారు.

## వారసత్వ నడక నిర్వహించడం అభినందనీయం



**నెల్లూరు ఆగస్టు ప్రభాతవార్త-వైద్యం** స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ నగరం నుంచి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లిపాడు పినాకిని గాంధీ ఆశ్రమానికి వారసత్వ నడక నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ కెవిఎన్. చక్రధర్‌బాబు కొనియాడారు. గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ నుంచి ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు పినాకిని గాంధీ ఆశ్రమం వరకు వారసత్వ నడకను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారసత్వ నడక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం అక్కడ నుంచి బయలుదేరి ఆత్మకూరు బస్టాండు, స్టోన్‌హౌస్‌పేట, కిసాన్‌నగర్, నాలుగోవ మైలు మీదుగా పినాకిని గాంధీ ఆశ్రమానికి చేరుకుంది. డీజే ధ్వనులు దేశభక్తి పాటలతో మారుమోగాయి. ప్రత్యేకంగా చిన్నారుల వేషధారణతో వారసత్వ నడక ఆకర్షణగా నిలిచింది. కలెక్టర్ కెవిఎన్. చక్రధర్‌బాబు మాట్లాడుతూ ఈనెల 1నుంచి 15వరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా గురువారం వారసత్వ నడక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. దాదాపు 13కిలోమీటర్లు దూరాన ఉన్న పల్లిపాడు పినాకిని గాంధీ ఆశ్రమానికి కాలినడకన వెళ్ళడానికి వచ్చిన ప్రతి ఒక్కరు అభినందనీయులన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రజల్లో కూడా ఈ కార్యక్రమం పట్ల మంచి స్పందన లభించడం హర్షించదగ్గ విషయమన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ ఉద్యమ స్ఫూర్తితో ప్రజలంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా ఈనెల 13 నుంచి 15వరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో కూడా పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆ రోజున ప్రతి ఇంటా జాతీయ జెండాను రెపరెపలాడాలని, జాతీయ జెండాతో సెల్ఫీ తీసుకుని హర్‌ఘర్ తిరంగా డాట్ కాం వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ నడకలో పాల్గొన్న వారికి ముందస్తుగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ పర్వతరెడ్డిచంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ వాణి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కనకదుర్గభవాని, డిపిఓ ధనలక్ష్మి, సెట్నల్ సీఈఓ పుల్లయ్య, పాల్గొన్నారు.

## దేశ సమగ్రతను కాపాడుతున్న సైనికులు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11 ప్రభాతవార్త** దేశ సమగ్రతను..దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు సైనికులు ఎంతగానో పాటుపడుతున్నారని జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు కొనియాడారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్ పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన వీర సైనికుల సంస్మరణ-యుద్ద వీరనారీమణులు-క్షతగాత్రులయిన సైనికుల సత్కార కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో పోరాటం చేసి అమరులైన వీర సైనికులను స్మరించుకోవడం..వీరనారీమణులను-క్షతగాత్రులయిన సైనికులను సన్మానించుకోవడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. పేద కుటుంబాలకు చెందిన మాజీ సైనికులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందన్న ఆయన వారికి వ్యవసాయ భూమి ఇవ్వడం జరుగుతోందన్నారు. పది పదిహేను సంవత్సరాల తర్వాత వారు అవసరమైతే ఆ భూమిని అమ్ముకొనే వీలు కల్పించడం జరిగిందన్న చక్రధర్‌బాబు ఇందుకోసం సకాలంలో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మాజీ సైనికులకు పక్కాగృహాలు కూడా మంజూరు చేస్తున్నామన్న ఆయన జగనన్న కాలనీలతోపాటు నెల్లూరు, కావలి తదితర ప్రాంతాలలో కొత్తగా వేస్తున్న ఎంఐజీ లేఔట్లలో కూడా మాజీ సైనికులకు ఇండ్లస్థలాలు కేటాయిస్తామన్నారు. ఇక దేశభద్రతకు సంబందించి కొత్తగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో నియామకాలు జరుగుతున్నాయన్న కలెక్టర్ ఇందులో భాగంగా సెప్టెంబర్ 18 నుండి నెల్లూరులోని ఏసీ స్టేడియంలో అగ్నిపథ్ పథకంలో భాగంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత పెద్దసంఖ్యలో ఎంపికయ్యేలా వారికి కృష్ణపట్నం ఓడరేవు ప్రాంతంలో..నెల్లూరులోని పోలీస్ శిక్షణాకేంద్రంలో...పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రెండుబ్యాచ్‌లుగా ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాకిస్తాన్ దళాల చేతుల్లో గాయపడ్డ చేజర్ల మండలం గొల్లపల్లికి చెందిన సిపాయిర్యాంక్ కొప్పుల పెంచలయ్యని ఘనంగా సత్కరించడంతోపాటు ఎల్‌టీటీఈలతో పోరాడి అమరుడైన మోదంపురి పాండురంగారావు సతీమణి కుసుకుమారిని, పదాతిదళం పోరాటవాహనం బోల్తాపడి అమరుడైన కలువాయికి చెందిన దాసినేటి పెంచల నరసింహయ్య సతీమణి ధనమ్మను ఘనంగా సత్కరించడంతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. కాగా ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి రమేష్, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, మైనారిటీ సంక్షేమశాఖాధికారి కనకదుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## నీ ఇష్ట ప్రకారం మాట్లాడితే చూస్తూ ఊరుకోం



**నెల్లూరు ఆగస్టు 11, ప్రభాతవార్త-వైద్యం** గోరంట్ల మాధవ్.. సిగ్గులేకుండా వీడియో కాల్ చేసి మాట్లాడడమే కాకుండా ఇతరులకు చూపిస్తానంటే ఇక్కడి ఎవరూ గాజులు తొడుక్కుని లేరని నీ ఇష్ట ప్రకారం మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. గురువారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గత వారం రోజులుగా మీడియా, సోషల్ మీడియాల్లో లింగేశ్వరప్రసాద్ అలియాస్ మాధవ్ చేసిన అశ్లీల చిత్రాలు హల్‌చల్ చేస్తున్నా పట్టించుకోని నువ్వు చేసిందే పెద్ద తప్పు అయితే దానిని పక్కదారి పట్టించిందేందుకు మా నాయకుడైన చంద్రబాబునాయుడుని తిడుతున్నారన్నారు. వారం రోజులపాటు నోరు మెదపని నువ్వు నీ పొట్టి ముఖ్యమంత్రి జగన్ మాటలు విని నీ ఇష్టం వచ్చినట్లు పేలితే తాట తీస్తామని ఆయన హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తలు సింహాలతో సమానమని నీ బరతం పట్టడం తథ్యమన్నారు.అనంతపురం ఎస్పీ ఆ వీడియోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కి ఇంకా పంపలేదని, హోంమంత్రి వనిత మాత్రం ఫోరెన్సిక్ ల్యాబ్‌కి అశ్లీల చిత్రాన్ని పంపించామని వారి రిపోర్టులో ఆ చిత్రం ఆయనదేనని తెలిస్తే చర్యలు తప్పవని వారు చెప్పారన్నారు. జిల్లా ఎస్పీ, రాష్ట్ర హోంమంత్రులు అయి ఉండి ఏవరు అబద్ధం చెపుతున్నారో ఏవరు నిజం చెపుతున్నారో ప్రజలకు అర్థం కావడంలేదన్నారు. ఎంపి మాధవ్ పోర్న్ చిత్రం కేసులో ఏవరైనా కేసు పెడితే చర్యలు తీసుకుంటామని అంటున్న ఎస్పీ ఆ కేసు పెట్టిన వారిపై తిరిగి కేసులు పెట్టి వారిని కూడా హతమార్చితే చోద్యం చూసేందుకాని శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించాడు. జగన్ వెంటనే గోరంట్ల మాధవ్‌ని అరెస్టు చేయించి జైలుకు పంపించాలని ఆయన డిమాండ్ చేశాడు. లేని పక్షంలో తమపార్టీ తరపున పోరాటాలు చేస్తామని కోటంరెడ్డి హెచ్చరించాడు. ఈ సమావేశంలో కప్పిర.శ్రీని వాసులు, ఖాదర్‌బాషా, కువ్వారపు.బాలాజీ, మొయినుద్దీన్, తానే.మస్తాన్, వినుకుల.సుధాకర్, కమ్మ.పెం చలనాయుడు, ప్రశాంత్, సుజన్‌కుమార్, మద్దెల.సురేంద్ర, ఎద్దుల.మహేష్ పాల్గొన్నారు.

## గర్బవతులకు,బాలింతలకు వైఎస్ఆర్ కిట్లు పంపిణి



**బుచ్చి ఆగష్టు 11 ప్రభాతవార్త** మండలంలోని చెల్లాయపాళెం హరిజనవాడలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా గర్బవతులకు,బాలింతలకు వైఎస్ఆర్ కిట్లు,బాలామృతం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఆశీర్వదించారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితమ్మ, ఎంపిడిఒ నరసింహారావు ,సిడిపిఒ సౌజన్య,సూపర్‌వైజర్ సునీతమ్మ,వైసిపి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి,అంగన్‌వాడీ కార్యకర్త టి భారతి తదితరులున్నారు.

## దామరమడుగులో అజాద్ కా అమృత్ ర్యాలీ

**బుచ్చి ఆగష్టు 11 ప్రభాతవార్త** మండలంలోని దామరమడుగులో ఆజాదీకా అమ్మత్ మహోత్సవ భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎం సుధాకర్ ఆద్వర్యంలో పాఠశాల ఉపాధ్యా యులు,విద్యార్ధులు ఈ ర్యాలీపెద్ద ఎత్తున చేశారు.విద్యార్ధులు జాతీయ నాయకుల వేషదారణతో ప్రదర్శన నిర్వహించారు. విద్యార్ధులందరు 30 మీటర్ల జాతీయ జెండాను చేతబూని నేషనల్‌హైవే మీద ప్రదర్శన నిర్వహించారు.పిఇటి మాష్టార్ నరసయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో స్కౌట్ మాష్టర్ పి జి డి కృపాల్,గైడ్ కెప్టెన్ వి కామాక్షి, ఉపాధ్యాయులు సురేష్, భాస్కరయ్య, రమణయ్య, కృష్ణమోహన్, వేణుగోపాల్, ఖాదరసా,పద్మావతి, నాగజ్యోతి,రమాదేవి,శ్రీనివాసులు, రవి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులంలో నేరుగా ప్రవేశానికి దరఖాస్తు

**నెల్లూరుటౌన్,ఆగస్టు 11 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ గురుకులం విద్యాలయ సంస్థల కార్యదర్శి ఉత్తర్వుల మేరకు,నెల్లూరులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల(మైనార్టీ-బాలుర) పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి 5,6,7,8 తరగతులలో నేరుగా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ టి.కామేశ్వరీ తెలిపారు.మైనార్టీ(ముస్లిం మైనార్టీ,క్రిస్టియన్ మైనార్టీ,బౌద్ధులు,సిక్కులు,జైన్ల)పిల్లల నుండి దరఖాసు_్తలు స్వీకరిస్తున్నామని తెలిపారు.గురుకుల పాఠశాలకు వచ్చి దరఖాస్తులు తీసుకోవచ_్చని తెలిపారు.సెప్టెంబర్ 31వ తేదిలోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు.గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు అర్హులని ప్రీ మెట్రిక స్కాలర్ షిప్ వర్తిస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.నూతన భవనం అక్కచెరువుపాడులో నిర్మించబడుతుందన్నారు.వివరాలకు 9701889873కి సంప్రదించాలన్నారు.

## ఉద్యాన రైతులకు శిక్షణా కార్యక్రమం



**ఉలవపాడు, ఆగష్టు 11, ప్రభాతవార్త** మండలంలోని కే.రాజుపాలెం గ్రామంలో గురువారం నాడు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖలోని నూతన సాంకేతిక యాజమాన్య పద్ధతులు, నూతన వంగడాలను రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఉద్యాన ఉత్పత్తులను మార్కెటింగ్ సౌకర్యం సకాలంలో కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మామిడికాయల కోత అనంతరం మామిడి తోటల్లో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. వాయిల మస్తానమ్మ, జడ్పీటీసీ చేవూరిఅరుణ, జిల్లాఉద్యాన అధికారి ఎంవీసుబ్బారెడ్డి, కందుకూరు అసిస్టెంట్ డైరక్టర్ దీపిక, కదుకూరు, ఉలవపాడు ఉద్యాన అధికారులు, వీఏఏలు, వీహెచ్ఏలు, ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు అండగా ఉంటా



**ఉలవపాడు, ఆగష్టు 11, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉలవపాడులోని సచివాలయం 2 పరిధిలో గల కొంత ప్రాంతాన్ని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి గడపగడకు వెళ్లి లబ్దిదారుల ఖాతాలలో పడిన నగదు గురించి వివరిస్తూ వారి యొక్క యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటూ ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక ఇంటికి చేరుకోగానే ఆ ఇంట్లో గల మల్లు వెంకట రవణమ్మ అనే మహిళ ఎమ్మెల్యేను చూడగానే ఆప్యాయంగా పలకరించి తనకు అన్నదమ్ములు ఎవరు లేరని తనని సోదరుడుగా భావించి రాఖీ పండుగ సందర్భంగా పురస్కరించుకొని రాఖీ కట్టి తన ఆప్యాయతను చాటుకుంది. ఆయన కూడా అదే విధంగా స్పందిస్తూ ఎప్పుడు మహిళలకు అండగాఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళల కోసం ఎన్నోకార్యక్రమాలు చేపట్టడంతో పాటు వారికి భరోసా కల్పించే విధంగా దిశా వంటి చట్టాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## శ్రీవిద్యానికేతన్‌లో తిరంగ ర్యాలి



**జలదంకి,ఆగస్టు11,ప్రభాతవార్త:** జలదంకి మండలం బ్రాహ్మణక్రాక శ్రీవిద్యానికేతన్‌లో గురువారం తిరంగ ర్యాలి నిర్వహించారు.ఈసందర్బంగా పాఠశాల విద్యార్ధినీ విద్యార్ధులు జండాలుచేబూని గ్రామ వీధుల వెంట తిరిగారు.మాతరం మాతరం,వందే మాతరం అంటూ నినాదాలు చేశారు.ఈసందర్బంగా పాఠశాల కరస్పాండెంట్ మారెళ్ళ బ్రహ్మారెడ్డి దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపును గూర్చి వివరించారు.హర్ ఘర్ తిరంగ ఉద్దేశ్యాన్ని గూర్చి తెలియజేశారు.ఈనెల13నుంచి15వరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెప లాడించాలని కోరారు.కార్యక్రమంలో పాఠవాల ఉపాద్యాయినీ, ఉపాద్యాయులు, పిల్లలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొండయ్య కుటుంబాన్ని పరామర్శించిన బొల్లినేని



**కొండాపురం,ఆగస్టు11,ప్రబాతవార్త:** కొండాపురం మండలం తూర్పుఎర్రబల్లి గ్రామ నివాసి టి.డి.పి సీనియర్ నేత సోము కొండయ్య గత కొద్దిరోజులుగా అనారోగ్యంగా వుండడాన్ని గుర్తి ంచిన తెలుగుదేశం పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్చ్ బొల్లినేని వెంకటరామారావు గువువారం కొండయ్య నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఆరోగ్యపరిస్తితిపై వాకబుచేశారు.ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.అనంతరం ఎర్రబల్లి గ్రామంలో జరుగుతున్న పిన్నిబోయిన ప్రవీణ్‌కుమార్ వివాహ వేడుకలలో పాల్గొన్నారు.ఈయన వెంట జిల్లా పార్లమెంట్ అధికారప్రతినిది యారవ కృష్ణయ్య,మండల టి.డి.పి కన్వీనర్ తల్లపనేని లక్ష్మీనారాయణ,రైతు అద్యక్షులు పోలినేని రమేష్,సీనియర్ నేత గద్దే రాగయ్య తదితరులు వున్నారు.

## తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకోరావాలి పోలంరెడ్డి



**కొడవలూరు ఆగష్టు 11 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం, నార్త్‌రాజుపాలెంలోని పి.ఎస్.ఆర్ కాళ్యాణ మండపం నందు గురువారం బుచ్చిరెడ్డిపాళెం సంబంధించిన తెలుగుదేశం పార్టీ మండల నాయకులతో, క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలతో, బూత్ కన్వీనర్లతో పార్టీ సమీక్ష సమావేశమును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి చెముకుల క్రిష్ణ చైతన్య సారధ్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడి పాల్గొన్నారు. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు అదేశాలు మేరకు కోవూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం కొరకు రాబోవు ఎన్నికల దృష్ట్యా ప్రతి గ్రామంలో 100 ఓట్లకు గాను ఒక బూత్ పరిధిలో 10 మంది యూనిట్ ఇన్‌చార్జీలు, సెక్షన్ ఇన్‌చార్జీలుకు ఒక బూత్ కన్వీనర్‌ను ఉండే విధంగా నాయకులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రభుత్వ ఇటీవలన జరిగిన స్థానిక ఎన్నికలలో, నగర పంచాయతీ, మునిసిపాలిటీ,కర్పోరేషన్‌ఎన్ని కలలో గాని ఓట్ల జాబితాను తారుమరు చేసి దొంగ ఓట్లతో గేలిచారని, ప్రజలు మా పక్షానా ఉన్నరు అన్న విషయాని తెలుగుదేశం పార్టీ తీవరంగా ఖడిస్తుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కొరకు నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మండల కన్వీనర్ ఎం.వి. వెంకటశేషయ్య, బత్తల హరిక్రిష్ణ, బండల కొండయ్య, సురేష్‌రెడ్డి, శంకర్ బుచ్చిరెడ్డి పాలెం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్‌అజీజ్‌కు రాఖీ కడుతున్న బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సుధారాణి



**నెల్లూరు ఆగస్టు 11, ప్రభాతవార్త-వైద్యం** రాఖీ పండుగను పురస్కరించుకుని గురువారం నగరంలోని హరనాథపురంలో ఉన్న నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్‌కు ఆంధ్రరాష్ట్ర బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాజీ రాష్ట్ర డైరెక్టర్, తెలుగుమహిళ కార్యనిర్వాహక కార్యదర్శి తడకపల్లి.సుధారాణి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా అబ్దుల్‌అజీజ్‌కు ఆమెను ఆశీర్వదించి నిండు నూరేళ్ళు మీరు, మీ కుటుంబసభ్యులు చల్లగా ఉండాలని దీవించారు. ఈ సందర్భంగా కుల, మతాలు, మనస్సులో ఎలాంటి కల్మషాలు, భేషజాలు, సోదర సమా నుడైన వ్యక్తి అబ్ధుల్‌అజీజ్ అని సుధారాణి కొనియాడారు. అందువల్లనే ఈ రాఖీ పండుగను పురస్క రిం చుకుని తన సోదరుడి వద్ద ఆశీర్వచనాలు తీసుకోవాలని వచ్చానని, ఆయనకు రాఖీ కట్టి ఆశీర్వచనం ఆయన వద్ద ఆశీర్వచనం పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## బిజెపి ఎస్‌సి మోర్చ అద్యక్షులుగా తిరుపతయ్య

**బుచ్చి ఆగష్టు 11 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని బిజెపి ఎస్‌సి సెల్ మోర్చ అద్యక్షులుగా నాగశాల తిరుపతియ్యను ఎంపిక చేసినట్లు బిజెపి నగర అద్యక్షులు రామిశెటి మోహన్ తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా నమామిగంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ పాల్గొన్నారు. నూతనంగా ఎని న్నికైన ఎస్‌సిసెల్ మోర్చ అద్యక్షులు నాగశాల తిరుపతియ్యను శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, ఉపాధ్యాక్షులు నరసింహరావు,నగర పంచాయితీ ప్రధాన కార్యదర్శి గంగపట్నం శ్రీనివాసులు,కనిసిరి శివ,ఉపాద్యాక్షులు సందల నాగేశ్వరరావు,జడపల్లి రమణమ్మ, పోలిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మాలమహానాడును బలోపేతం చేద్దాం



**నెల్లూరుటౌన్,ఆగస్టు 11 ప్రభాతవార్త** మాలమహానాడును దళితరత్న స్వర్ణావెంకయ్య ఆద్వర్యంలో బలోపేతం చేసుకుందామని జిల్లా అధ్యక్షులు బల్లి వెంకయ్య అన్నారు.నెల్లూరు నగరంలోని టౌన్‌హాలు వర్ధమాన సమాజమందిరంలో గురువారం మాలమహానాడు సమావేశం జరిగింది.ఈసమావేశంలో బల్లి వెంకయ్య మాట్లాడుతూ మాలమహానాడు భవిష్యత్ కార్యచరణపై చర్చించారు.గ్రామ,మండల,పట్టణ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసుకుని మహానాడును బలోపేతం చేసుకుందామని పిలుపు నిచా_్చరు.మాలమహానాడు స్థాపించి 25సంవత్సరాలు పూర్తయిన సంధర్బంగా సిల్వర్‌జూబ్లీ సంబరాలను జరుపుకుంటున్నా మన్నారు.ఈసంధర్బంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.రాష్ట్ర మహిళా కార్యదర్శిగా చేసు సుజాతమ్మ,జిల్లా వ్యవసాయ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులుగా గంపా జగన్నాధరావు,జిల్లా విద్యార్ధి సంఘం అధ్యక్షులుగా కె.జానీ,మహిళవిభాగం నాయకురాలు విజయమ్మ,డి.శ్వేతలను ఎన్నుకున్నారు. చెందోటి శ్రీనివాసులు,అరవ ప్రభాకర్,లాలం పెంచలయ్య,కె.సూర్యనారాయణ,గద్దె సాల్మన్‌బాబు,అరవ సెల్వీరాజ్ పాల్గొన్నారు.





# పోటెత్తిన భక్తులు

## వేడుకగా గంధమహోత్సవం











## బిట్రగుంటలో ఆజాదికా అమృత సరోవర్



**బిట్రగుంట, ఆగస్టు 11 ప్రభాతవార్త** బోగోలు మండలం బిట్రగుంట గ్రామ పంచాయతీలో ఆజాదికా అమృత సరోవర్ కార్యక్రమం క్రింద కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ నిధులతో చేపట్టిన చెరువు చుట్టు పరిసర ప్రాంతాలలో గురువారం జాతీయ జెండాలు పట్టుకొని తిరంగా మార్చ్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 24న ఉపాధి హామీ పథకం నిధులతో చెరువులు, నీటి కుంటలు కొత్తగా ఏర్పాటు చేయడం,పునరుద్దరించడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్వాతంత్రం వచ్చి 75 వసంతాలు జరుపుకునే నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కావలి క్లస్టర్ డ్వామా ఎపిడి మృదుల, ఎంపిడివో నాసరరెడ్డి, గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, గ్రామ నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అందరూ ఐక్యమత్యంగా వుండి జాతీయ భావంతో మెలగాలి



**కావలి రూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త** అందరూ ఐక్యమత్యంగా వుండి జాతీయ భావాలతో మెలిగి ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని కావలి ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు కోరారు. కావలి రూరల్ మండలం అన్నగారిపాళెం గ్రామ పంచాయతీలో ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా అమృత సరోవర్ చెరువు వద్ద గురువారం ఎంపిడివో అమ్మిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ భారత్ మాతాకీ జై అనే నినాదాలతో ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఎంపిడివో సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీలో నిర్మించిన అమృత సరోవర్ చెరువు భవిష్యత్‌లో రైతులకు, గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్స్ శ్రీనివాసులురెడ్డి, బాలస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఉపాధి కూలీలు,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న పెద్దల్ని సన్మానించడం ఆనందంగా వుంది



**కావలి రూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త** స్వాతంత్రోద్యమంలో పాల్గొని అష్టకష్టాలు పడిన పెద్దల్ని సన్మానిం చడం ఎంతో సంతోషంగా వుందని, ప్రతి ఒక్కరు వారిని ఆదర్శంగా తీసుకోవాలని గౌరవరం సర్పంచ్ దేవ రపల్లి రాధిక తెలిపారు. ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామంలో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న 99 సంవత్సరాల తిప్పారెడ్డి సుబ్బరామిరెడ్డి, 98సంవత్సరాల మేదరమెట్ల శివరవమ్మలను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్ దేవరపల్లి రాధిక మాట్లాడుతూ పెద్దల్ని గౌరవించడం మన సంప్రదాయమన్నారు. ముఖ్యంగా స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న వారిని గౌరవించడం దేశాన్నిగౌరవించడమేనన్నారు. వారి ఆశీస్సులు అందరికి వుండాలన్నారు. స్వాతంత్ర సమరయోధుల అడుగుజాడలలో పయనించాలన్నారు. ఉపసర్పంచ్ సురే శ్రీలత, పంచా యతీ కార్యదర్శి రవి చంద్ర కుమార్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా మారిన రోడ్లను విస్మరించిన అధికారులు !



**కావలి, ఆగస్టు 11 ప్రభాతవార్త** కావలి పట్టణంలో దాదాపుగా ఏ వీధి చూసినా గుంతలతో, అడ్డంకులతో అస్తవ్యస్తంగా మారాయని, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని సిపియం పార్టీ నేతలు ధ్వజమె త్తారు. కావలి పట్టణంలోని పలు వీధుల్ని గురువారం సిపియం నేతలు పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కావలి సిపియం పట్టణ కార్య దర్శి పసుపులేటి పెంచలయ్య, పట్టణ కమిటీ సభ్యులు వై.కృష్ణమోహన్, పి.కృష్ణయ్యలు పాల్గొని మాట్లాడారు. కావలి పట్టణంలోని రోడ్లు పగిలిపోయి గుంతలు ఏర్పడ్డాయన్నారు. రోడ్ల మీదే మట్టి కుప్పలు వుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులుగా మారాయ న్నారు. విద్యార్థులు ఎంతో ఇబ్బందులుపడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు పట్టించు కోవ డం లేద న్నారు. వర్షం పడినప్పుడల్లా ప్రజలు, విద్యార్థులు, వాహనాలు ఈ గుంతలలో పడి ప్రమాదాలకు లోనవు తున్నారన్నారు. చీకటి పడితే వీధి లైట్లువెలగడంలేదన్నారు. సమస్యల వలయంలో ప్రజలు చిక్కు కొని ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు మొండి వైఖరి అవలంభిస్తున్నారన్నారు. వారి ఆదాయ వన రులలో నిమగ్నమయ్యారే తప్ప అధికారులు అభివృద్ధి విస్మరించారన్నారు. అస్తవ్యస్తంగా మా రిన రోడ్ల పరి స్థితి పట్టించుకోకపోతే త్వరలో ప్రజలతో ఆందోళన చేపడతామని వారు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు.

## పొట్టి శ్రీరాములు పురపాలక సంఘ విద్యార్థుల ర్యాలీ




**కావలి, ఆగస్టు 11 ప్రభాతవార్త** కావలి పట్టణ వెంగళరావునగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ పాఠశాల ఎన్‌సిసి ఆఫీసర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో ఘర్‌ఘర్ ఫర్ హమారా తిరంగ ర్యాలీని చేపట్టారు. విద్యార్థులు ఇంటింటికి తిరిగి తిరంగా జెండాను ఎగురవేసి అవగాహన కల్గించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సుబ్బారావు, ఉపాధ్యాయులు హయ్యూల్ హయ్యూమ్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గిరిష్, ఎ.ఎన్.రామ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఎగురవేసిన డీఎంహెచ్ఓ

**నెల్లూరు ఆగస్టు 11, ప్రభాతవార్త-వైద్యం** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15 తారీఖున వార్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నేడు గురువారం నగరంలోని స్థానిక సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యాశాఖాధికారి ఎం.పెంచలయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. ఐదు రోజులపాటు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో, గృహాల్లో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన త్యాగ ధనులను మనకు స్వాతంత్ర్య సముపార్జనకు చేసిన సేవలను జ్ఞప్తికి తెచ్చుకోవాలని ఆయన కోరారు. బారాషాహిద్ దర్గాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను డీఎంహెచ్ఓ సందర్శించి వైద్య ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆజాదిక అమృతమహోత్సవ్ వేడుకలు




మర్రిపాడు,ఆగస్ట్11,ప్రభాతవార్త: మర్రిపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యాక్రమాలను నిర్వహించారు. మర్రిపాడు గ్రంథాలయ నిర్వాహకులు నారాయణరావ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు .ఈసందర్భంగా 3,4,5 వ తరగతి విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో విజేతలైన ఆర్.కీర్తన, వై.హసీన, ఎం.హేమంత్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివజ్యోతి బహుమతులను అందజేశారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది ,విద్యార్థులు ర్యాలీ



**అనంతసాగరం,ఆగస్ట్11,ప్రభాతవార్త:** ఆజాదికా అమృత్‌మహోత్సవ్‌లో భాగంగా అనంతసాగరం మండలం సోమశిలలో గురువారం సచివాలయ సిబ్బంది, ఉన్నతపాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వ హజంచారు. ఈసందర్భంగా 13,14,15 తేదీల్లో గ్రామంలోని ప్రతి ఇంటిమీద జాతీయ జెండాను ఎగురవేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్‌లో మహాత్మగాంధీ , బస్టాండ్ సెంటర్‌లోని బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో విఆర్ఒ ఉదయగిరి ప్రభాకర్, వెల్ఫేర్‌అసిస్టెంట్ మనోజ్‌కుమార్, వ్యవసాయ సహాయకురాలు కీర్తి, ప్రధానోపాధ్యాయులు ఎస్.చందన తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తూ జాతీయ జండాను ఎగురవేయండి



**జలదంకి,ఆగస్టు11,ప్రభాతవార్త:** ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జండాను ఎగురవేసే క్రమంలో ఈనెల 13నుంచి నిబంధనలను తూచా తప్పకుండా పాటించి గుండెలనిండా దేశ భక్తిని నింపుకోవాలని మండలాధ్యక్షుడు గోచిపాతల.వెంకటరమణయ్య పిలుపు నిచ్చాడు.గురువారం స్థానిక ఎం.పి.డి.ఒ కార్యాలయంలో అన్ని పంచాయతీల కార్యదర్శులకు జండాలను ఎం.పి.డి.ఒ ఆదినారాయణతో కలసి అందజేశారు.ఈసందర్భంగా చిరిగిపోయిన,నలిగిపోయిన,పాతజెండాలను ఎగురవేయకూ డదన్నా రు. మూడురంగులు,అశోక చక్రం తప్ప మరో రంగు రాతలు అస్సలు వుండకూడదన్నారు.కాషాయరంగుపైకి ఆకుపచ్చరంగు దిగువకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.భారతదేశం వందల ఏళ్ళ బానిసత్వంనుంచి విముక్తికలిగి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న క్రమంలో ప్రధాని నరేంద్రమోది హర్ ఘర్ తిరంగా పిలుపునిచ్చారని కావున ఈపండుగను ప్రతి గ్రామంలో అత్యంత జాగూరు కతతో నిర్వహించాలని పేర్కొన్నారు.

## కోదండరామపురంలో ఆజాదీకా అమృత్‌మహోత్సవం



**జలదంకి,ఆగస్టు11,ప్రభాతవార్త:** జలదంకి మండలం కోదండరామపురంలో గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవం నిర్వహించారు.ఈసందర్భంగా స్థానిక మాలకొండారెడ్డి గుంటనుజాతీయగ్రమీణ గ్రామీణ ఉపాదిహామీ పదకంకింద అభివృద్ధి పరుస్తున్న క్రమంలో పనులను పరిశీలించారు.కట్టబ లోపే తం,సెక్ష నింగ్, జంగిల్‌క్లియరెన్స్,ప్లానిటేషన్ వంటివి తనిఖీచేశారు.అన ంతరం కట్టచుట్టూ మొక్కలు నా టారు.జాతీయ జండాను ఆవిష్కరించారు.జాతీయగీతాలాపన చేశారు.హర్ ఘర్ తిరంగను గూర్చి వివ రిం చారు.ప్రధాని నరేంద్రమోదీ పిలుపును వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వి.కృష్ణారెడ్డి,ఎ.పి.ఒ శ్యా మల,ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ స్థలాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**కోవూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రెస్‌క్లబ్ నూతన నిర్మాణానికి స్థలాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్‌ను ఎంతమేర స్థలం కేటాయించారు అనే విషయాలనుఅడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ పద్మజ, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమణయ్య, రాకేష్, తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



**కోవూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** కరోనా సమయంతో పాటు ప్రస్తుతం సమాజంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డిలు తెలిపారు. కోవూరులోని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గురువారం అసెంబ్లీ ఆఫ్ బిలీవర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 60 మంది పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు నిరుపమానం అన్నారు. అటువంటి వారిని ఇప్పటికే తమ ఆధ్వర్యంలో సత్కరించడం కూడా జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ స్వచ్ఛంద సంస్థ ఈ వర్షాకాలం సీజన్‌లో వారికి దుప్పట్లు పంపిణీ చేసేలా ముందుకు రావడం అభినందనీయం అన్నారు. అదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పారిశుధ్య కార్మికులకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతుసంఘం అధ్యక్షుడు బి. శ్రీధర్, వార్డు సభ్యులు అనూప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కె. ప్రసాద్, వెంకట రమణయ్య, తదితరులు ఉన్నారు.

## సమాజాభివృద్ధిలో చదువే కీలకం



**కోవూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలంటే చదువే మూలమని ప్రజాప్రతినిధులు తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాపట్లలో జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల చేసిన సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. భారతదేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా కేవలం మన రాష్ట్రంలోనే ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థుల కోరకు జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, విదేశీ దీవెన కార్యక్రమాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వారి అభివృద్ధి కొరకు పాటుపుతున్నారన్నారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు ముఖ్యమంత్రి మార్చివేశారన్నారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు సైతం కోట్లాది రూపాయలను జగన్‌మోహన్‌రెడ్డి చెల్లించడం జరిగిందన్నారు. గతం కంటే భిన్నంగా ప్రభుత్వం విడుదల చేసే ప్రతి పథకం అర్హత కలిగిన వారికి నేరుగా వారి ఖాతాలోనే జమ చేసేలా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అదే విధంగా భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసి ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందించేలా ముఖ్యమంత్రి దృష్టి పెట్టారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించేలా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఒక వైపు రాష్ట్రంలో లోటు బడ్జెట్‌లో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పనితీరుపై ప్రశంసల వర్షం కురిపించారు. అనంతరం కోవూరు నియోజకవర్గానికి సంబంధించి 3.99 కోట్ల చెక్కునుఅందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఈసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, మండలవ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూ మనోజ్, ఈవోపీఆర్డీ కల్పన, నేతలు అనూప్‌రెడ్డి, శ్రీధర్, రాజగోపాల్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా శ్రీ రాధాకృష్ణ శివసాయి మందిరం ప్రారంభం



**కోవూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** కోవూరులోని కోనమ్మతోట ప్రాంతంలో గురువారం ప్రాత:కాలమునే శ్రీ రాధాకృష్ణ శివసాయి మందిర విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సాంప్రదాయబద్దంగా భక్తుల జయజయ ధ్వనుల మధ్య, రుత్వికుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్టించారు. వాస్తు బ్రహ్మ రాధాకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని ఘనంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రాధాకృష్ణ కళ్యాణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, భక్తులు ఉన్నారు.

## తెగుళ్ల పట్ల రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయంలో వస్తున్న నూతన మా ర్పులపై పూర్తిగా అవగాహన చేసుకో వడమే కాకుండా తెగుళ్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి తెలిపారు. కోవూరు మండలం పాటూరు గ్రామంలో బుధవారం ఆమె తెగు లు సోకిన రైతు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎరువులు వాడే సమయంలో భూసార పరీక్షల ఆధారంగా వాడుకోవడం వలన అనేక ఉపయోగాలు కూడా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వరిలో ఎండాకు తెగులు సోకిందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ము ఖ్యంగా వరిలో నత్రజని, భాస్వరం, పొటాష్ లను సిఫార్సు మేరకే వాడుకోవాలన్నారు. రైతులు సూప ర్ ఫాస్ఫేట్ డీఏపీ కాంప్లెక్స్ ఎరువులను సిపార్సు కన్నా ఎక్కువ మోతాదులో వాడడం వలన పలు చోట్ల తెగు లు సోకేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా జింక్ సల్ఫేట్‌ను దుక్కిలోనే వేయాలని ఈ సంద`ర్భంగా ఆమె రైతులకు సూచించారు. భాస్వరం, నత్రజని ఎరువులను అధికంగా వాడి పొటాష్‌ను అందులో లేకపోవడం వలన పోషకాల సమతుల్యత దెబ్బతిని పైర్లు తెగుళ్ల బారిన పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు మౌనిక, మెహర్నిసా, రైతులు ఉన్నారు.

## రైతు భరోసా కేంద్రం పరిశీలన



**సైదాపురం, ఆగస్టు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తురిమెర్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారిణి హైమావతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని రైతులకు ఆయా పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న సహాయకులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పొందేందుకు ప్రతి ఒక్క రైతు ఈకేవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని ఆమె రైతులకు సూచించారు.

## సైదాపురం సచివాలయంలో వైద్య పరీక్షలు



**సైదాపురం, ఆగస్టు 11, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సైదాపురంలోని గ్రామ సచివాలయంలో నెల్లూరుకు చెందిన మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆసుపత్రి వారు సైదాపురం పంచాయతీ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు గురువారం క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించి మొత్తం 64 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 6 మంది క్యాన్సర్ పేషెంట్లుగా గుర్తించడం జరిగిందని వైద్యులు సింధురెడ్డి, ఎస్.ఆర్.ప్రియ, మయూరిలు తెలిపారు. అలాగే గైనకాలజీ 18 మంది, బిపి, షుగర్, థైరాయిడ్ ఉన్న 40 మందిని గుర్తించడం జరిగిందని వారు తెలిపారు. వారికి నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వెందోటి శారదమ్మ, పంచాయతీ కార్యదర్శి శశీంద్రాణి, గ్రామ ఉపసర్పంచు బొలిగర్ల శివకుమార్, మెడికవర్ ఆర్గనైజర్ షేక్ మస్తాన్, కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## చివరిరక్తం బొట్టు ఉన్నంత వరకు జగన్‌తోనే : ప్రసన్న



**బుచ్చి ఆగష్టు 11 ప్రభాతవార్త** చివరి రక్తం బొట్టు ఉన్నంత వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హ న్‌రెడ్డితోనే తన ప్రయాణం అని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. చెల్లా యపాళెం హరిజనవాడ,పల్లిపాలెంలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు విజయవాడకు చెందిన ఒ యూట్యూబ్ ఛానల్ నన్నుటార్గెట్ చేసి రకరకాలుగా ప్రచారం చేస్తున్నారని అ న్నా రు.నేను టిడిపిలో చేరతానని అందులో ప్రచారం చేశారు.ఎట్టి పరిస్థితిలలో నేను పార్టీ మారే ప్రసక్తే లేదని అన్నారు.మంత్రి పదవి ఇవ్వలేదని అలిగినట్లు ప్రచారం చేశారని చెప్పారు.విజయమ్మ,జగన్‌మోహన్‌రెడ్డి తరువాత వైసిపి శాసనసభ్యుడుగా ప్యానుగుర్తుపై గెలిచి అడుగుపెట్టిన మొదటి ఎమ్మెల్యే ని అని ఆయన స్పష్టం చేశారు.నేను చనిపోయేవరకు....నేను చనిపోయేవరకు...నేను చనిపోయేవరకు జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటానని ఆయన విలేఖర్ల ముందు ఆవేదన భరితంగా అన్నారు.నేను మంత్రి పదవి ఇవ్వలేదని ఏనాడు బాధపడలేదని అన్నారు.నేను చనిపోయినా నాబిడ్డ రజిత్‌కుమార్‌రెడ్డి కూడా జగన్‌మోహన్‌రెడ్డితోనే కొన సాగుతారని అన్నారు.రాష్ట్రంలో చంద్రబాబునాయుడ్ని ఎక్కువగా తిట్టింది నేనే నా తరువాత ఆ పోస్టు మం త్రి కొడలినాని తీసుకున్నారని అన్నారు.మంత్రి పదవి రావాలన్నా అదృష్టం ఉండాలని అన్నారు.నాకు మంత్రి పదవి ఇవ్వలేదని నియోజకవర్గంలో నాయకులు దిష్టిబొమ్మలు తగలపెడతాం,వాహనాలు తగలబెడతాం అంటే మీరు అలా చేస్తే నేను వెంటనే నా పదవి రాజీనామా చేసి స్పీకర్‌కి పంపిస్తానని చెప్పానని అన్నా రు.అలా చేస్తే మననాయకుడ్ని మనం కించపరచుకున్నట్లేనని అన్నారు.ముఖ్యమంత్రికి ఎన్ని సమస్యలు ఉ న్నాయో ఆయనకు తెలుసు.మంత్రి పదవి రాలేదని కొన్ని నియోజకవర్గాలలో దిష్టిబొమ్మలు తగలబెట్టా రు,వాహనాలు తగలబెట్టారు అది తప్పని అన్నారు.మనం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ ం చేసి మాకు ఓట్లు వేశా రు.నన్ను చూసి నాకు ఓట్లు వేయలేదు.జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నాకు 40వేల ఓట్లు మెజార్టీతో గెలి పించారని అన్నారు.నేను కోవూరు నియోజకవర్గంలో 8 సార్లు పోటి చేస్తే 6 సార్లు గెలించారని తెలి పారు.నేను తెలుగుదేశం పార్టీ నుండి బయటకు వస్తే 80 శాతం మంది నాతో వచ్చారు.కోవూరు నియోజ కవర్గం ప్రజల మేలు ఎన్నిటికి మరచిపోలేనని అన్నారు.,జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిసచివాలయానికి 20 లక్షలు ఇస్తున్నారు.దానికి సంబంధించి జీవో కూడా ఇచ్చారని ఆయన తెలిపారు.చెల్లాయపాళెంలోనిహరిజనవాడలో డ్రైన్‌లకు 10 లక్షలు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరో 5 లక్షలు ఇచ్చారని తెలిపారు.చెల్లాయపాళెం ఊరిలో 7 లక్షలు,వడ్డిపాళెంలో 3 లక్షలు డ్రైన్స్‌కి పెట్టడం జరిగిందని అన్నారు.ముంబాయి రహదారి నుండి వీధిలైట్ల కోసం 6 లక్షలు వరకు దండడం జరిగిందని దానిని తిరిగి ఇచ్చివేయమని అన్నారు. వీదిలైట్లకోసం 3 లక్షలా 4244 రూపాయాలు అవుతుందని ఎఇ చెప్పారని దానిని నేను ఎంఎల్‌ఏ ఫండ్ నుండి మం జూరు చేస్తున్నట్లు తెలిపారు.హరిజనవాడ నుండి చినతోపుకు కూడా 2 లక్షలు మంజూరు చేస్తానని తెలి పారు.బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఎంఎల్‌ఏ ఫండ్ నుండి 21 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నిదులు 5 లక్షల రూపాయాలు, మండల జనరల్ ఫండ్ 2 లక్షలతో కలిపి ఆర్‌ఓప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.చెల్లాయపాళెం అభివృద్ధికి శక్తివంచలేకుండా కృషి చేస్తానని అన్నా రు.ఈకార్యక్రమంలో నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రోహిత్‌రెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి,ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు,ఎంపిడిఒ నరసింహరావు,మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి,నగర కన్వీనర్ టంగుటూరు మల్లికార్జునరెడ్డి, సిఐ కోటేశ్వరరావు,ఎస్ఐ వీరప్రతాప్,హౌసింగ్ ఏఇ గౌస్‌మొహుద్దీన్,ఆర్ఐ సుధా, చెల్లాయపాళెం నాయకులు కోవూరు మురళీ,వెంకయ్య,రత్నం,చెముగుడుగుంట కృష్ణయ్య,ఆదిశేషయ్య,కోవూరు రాఘవ,రొండ్ల రాజా, రొండ్ల వాసు,చెన్నయ్య,గోని శ్రీనివాసులు,రమేష్, మల్లికార్జున,బుచ్చి మైనార్టీ నాయకులు డాక్టర్ అల్లాబ క్ష,సెక్రటరీ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో భాగంగా మండలంలో కొత్తగా నియామకం అయిన వాలింటర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

## ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కి రాఖి కట్టిన చెల్లెమ్మ



**బుచ్చి ఆగష్టు 11 ప్రభాతవార్త** రాఖి పౌర్ణమి సంద ర్భంగా మండలంలోని చెల్లాయపాళెం గ్రామంలో ఎమ్మెల్యే య నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి అరుణమ్మ రా ఖికట్టి ఆశీర్వాదం తీసుకుంది.అలాగే వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డికి కూడా ఆమె రాఖి కట్టిస్వీట్ తినిపించి ఆశీర్వాదం తీసుకుంది .అక్కచెల్లె మ్మలందరికి ఎమ్మెల్యే రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల చదువులకు జగనన్న పెద్దపీట



**కావలి, ఆగస్టు 11 ప్రభాతవార్త** విద్యార్థుల చదువులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశా రని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి మద్దూరుపాడు డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జగనన్న విద్యాదీవెన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులకు జగనన్న విద్యాదీవెన చెక్కులు అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. జ గనన్న విద్యా దీవెన క్రింద కావలి నియోజవర్గంలో 6 వేల 450 మంది లబ్దిదారులకు 4 కోట్ల 20 లక్షల 6 వేల 30 రూపాయలు అందజేయడం జరిగిందన్నారు. జగనన్న పాలనలో విద్యారంగానికి అధిక ప్రాము ఖ్యత ఇస్తున్నారన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన తదితర పథకాలు ప్రవేశపెట్టి విద్యార్థుల అభ్యు న్నతికి పాటుపడుతున్నారన్నారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిం చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుకు పాటుపడుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో శీనానాయక్, డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ డాక్టర్ దామిశెట్టి బాలసురేష్‌బాబు, కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.రావు, వైసిపి నాయకులు షాహుల్ హమీద్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుల ఇంట కమిషనర్

**అల్లూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త** ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా అల్లూరు నగర పంచాయ తీలో స్వాతంత్ర సమరయోధుల ఇళ్ళకు గురువారం అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ పణికుమార్ వెళ్లారు. ఈ సందర్బంగా స్వాతంత్ర సమరయోధుల వారసుల కుటుంబ సభ్యులు నూకలపాటి రామమ్మ ఇంటి విచ్చేసి కమిషనర్ మాట్లాడారు. స్వాతంత్రం రాకముందు వున్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామమ్మ మాట్లాడుతూ మా పుట్టింటి వారు, అత్తింటి వారు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నార న్నారు. ఎందరో త్యాగధనుల ఫలంతోనే నేడు మనం స్వాతంత్రం అనుభవిస్తున్నామన్నారు. కమిషనర్ పణి కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులను ఆజాదికా అమృత మహోత్సవంలో కలవడం జరుగు తుందన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు ఈ నెల 13 నుంచి 15వ తేది వరకు ప్రతి ఇంట జాతీయ జెండాలు ఎగురవేయాలన్నారు. వాలంటీర్ల ద్వారా జెండాలు పంపిణీ చేస్తామన్నారు.అందరు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఆయన వెంట నగర పంచాయతీ సిబ్బంది రాజేష్, సాయి వున్నారు.

## పిఎసిఎస్‌లోను బంగారు రుణాలు

**చేజర్ల,ఆగస్ట్11,ప్రభాతవార్త:** ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోను త్వరలో బంగారు రుణాలను ఇవ్వనున్నట్లు నెల్లూరు డిసిసిబి సిఇఒ నిరంజన్‌బాబు పేర్కొన్నారు. బ్యాంకుల్లో రైతులకు బం గారు ఆభరణాలను తనఖా ఉంచుకొని తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నారని అలాగే తమ సొసైటీల్లోను బంగారు రుణాలను అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. చేజర్ల పిఎసిఎస్ ఆవర ణలో నిర్మాణంలో ఉన్న గోడౌన్‌ను ఆయన పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తిచేసి రైతులకు అవసరమైన యూరియా , కాంప్లెక్స్ ఎరువులను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు . రైతు ల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సహకార సంఘాల అభివృద్ధికి తద్వారా రైతులు లాభపడేందుకు అవ సరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో చేజర్ల పిఎసిఎస్ చైర్మెన్ బూదళ్ళ వీరరాఘవరెడ్డి , సిఇఒ రాగిపిండి గురవారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మాతమ్మ ఉత్సవాలు

**చేజర్ల,ఆగస్ట్11,ప్రభాతవార్త:** చేజర్ల మండలం చిత్తలూరులో గురువారం నుంచి మాతమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా ఈ సీజన్‌లో మాతమ్మకు పొంగళ్ళు పెట్టడం, ఉత్సవాలు చేయడం , సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## విద్యార్దులకు ఎన్నికలపై అవగాహన అవసరం



**నెల్లూరు ఆగస్టు 11 ప్రభాతవార్త-విద్య** విద్యార్దులకు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన అవ సరమని, యిందులో భాగంగా తమ పాఠశాలలో క్లాస్ లీడర్ (కేబినెట్) ఎన్నికలు నిర్వహించి వారికి అవగా హన కల్పించడం జరిగిందని నారాయణ పాఠశాలల ఏ జీఎం రవివర్మ పేర్కొన్నారు. గురువారం స్దానిక ఏసిన గర్‌లోని నారాయణ ఈ టెక్నో స్కూల్ ఆవరణలో వి ద్యార్దుల కేబినెట్ ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఆయన తన ఓటు హ క్కును వినియోగించుకున్న అనంతరం మాట్లాడుతూ విద్యార్దుల్లో స్పూర్తి నింపేందుకు యిలాంటి కార్యక్ర మాలు దోహదపడుతాయని తెలిపారు. ఎన్నికలను అగ్ని, త్రిసూల్, పృద్వి, నాగ్ తదితర నాలుగు విభా గాలుగా విభజించి నిర్వహించామన్నారు. విద్యార్దులు తమ ఓటు హక్కును వినియోగించుకుని అవగాహన పెంచుకున్నారని వివరించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎస్ రమ మాట్లాడుతూ విద్యార్దులకు ఎన్నికల నిబందనలు, నియమావళి, ఎన్నికల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు కేబినెట్ ఎన్నికలను నిర్వహించడం జరిగిం దన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఆర్ఐ ఆదిశేషయ్య, ఉపాద్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.

## దేశభక్తుల త్యాగాలు వెలకట్టలేనివి



**నెల్లూరు ఆగస్టు 11 ప్రభాతవార్త-హరనాధపురం** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయో ధులను, దేశభక్తుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి ని స్మరించుకోవడం మనందరి భాద్యతనిభా రతీయ జనతాపార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజ కవర్గ అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్దానిక విజయమహల్ గేట్ సెంటర్ వద్దనున్న పూలే దంపతుల విగ్ర హాలను శుబ్రపరిచి నివాళలర్పించారు. ఈ సంద ర్భంగా గుండ్లపల్లి మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా సంబరాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు బిజెపి కార్యకర్తలు, నాయకులు దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో దేశభక్తుల విగ్రహాలను శుబ్రపరిచి నివాళులర్పించి స్మరించుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా 20కోట్ల మంది ఇళ్ళపై జాతీయ జెండాను ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకునే అవకాశం కల్పించారన్నారు. 14వ తేదిన భారత్ అడ్డగోలు విభజనకు నిరసనగా మౌన ప్రదర్శనను నిర్వహించడం జరుగుతుందని, స్దానిక విఆర్ కళాశాల నుండి గాందీబొమ్మ సెంటర్ వరకు జాతీయ జెండాలను చేతబూని ప్రదర్శనలో పాల్గొంటామని తెలిపారు. నేడు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి భాయ్ పూలే విగ్రహాలను శుబ్రపరిచి నివాళులర్పించడం జరిగిందన్నారు. హర్ ఘర్ తిరంగ్ పేరుతో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 54 దేశాలలో బ్రిటీష్ పాలనసాగిందన్నారు. 53 దేశాలలో ఎలాంటి విభజన జరగకుండా స్వాతంత్ర్యం సిద్దించిందని, భారత్‌ను మాత్రమే అడ్డుగోలుగా విభజించారని గుర్తు చేశారు. అప్పటి పాలకుల నిరంకుశపాలన వల్ల దేశం విభజించబడిందన్నారు. ఈనెల 14న జరగనున్న మౌన ప్రదర్శనను జయప్రదం చెయాలని ఆయన పిలుపునిచ్చారు.నాయకులు గిరికుమార్‌గౌడ్, అశోక్‌నా యుడు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన లెఫ్టినెంట్ అఖిల్



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11 ప్రభాతవార్త** భారత సైనికరంగంలో లెఫ్టినెంట్‌గా ఎన్నికైన కొడవలూరు మం డలం రామాపురానికి చెందిన అఖిల్ జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సుబేదార్‌గా పదవీవిరమణ పొందిన ఎస్‌జీభాషా కమారుడైన అఖిల్ తన తండ్రితో కలిసి కలెక్టరేట్ ఆవ రణంలోని తిక్కన ప్రాంగణంలో గురువారం కలెక్టర్‌ను కలిశారు. తన కుమారుడైన అఖిల్ ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ చెన్నైలో శిక్షణ పొందాడని, రాజ్‌పుత్ రెజిమెంట్‌లో కమీషన్ తీసుకొని జమ్మూకాశ్మీర్‌లో నియా మకం పొందాడని ఈ సందర్బంగా భాషా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్బంగా చక్రధర్‌బాబు ఆ కుటుం బాన్ని అభినందించడం గమనార్హం.

## రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ప్రయోజనం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబం లబ్దిపొందడం జరుగుతోందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్‌ప్రాసె సింగ్‌శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన జగనన్న విద్యాదీవెన చెల్లింపుల కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. బాపట్ల నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన పథకంలో ద్వారా ఉన్నత చదువులు చదువు కుంటున్న విద్యార్దుల తల్లుల అకౌంట్లలో బటన్ నొక్కి నగదు జమ చేయగా వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుండి పాల్గొన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లాలోని 53,789 మంది విద్యార్దులకు సంబంధించిన రూ. 35,84,17,661 రూపాయలను చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వల్ల ప్రతి కుటుంబం లబ్ది పొందు తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముందుగానే సంక్షేమ క్యాలండర్‌ను విడుదల చేసి ఆ మే రకు సంక్షేమ పథకాలు అమలుచేయడం జరుగుతోందన్న మంత్రి ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ ఏటా రూ. లక్ష రూపాయల నుండి రూ. 2 లక్షల వరకు అందుతోందన్నారు. ఈ నేపధ్యంలో తాము గడప గడ పకు ప్రభుత్వం పేరిట కార్యక్రమం నిర్వహిస్తుండగా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో విద్యకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలను అమలుచేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు క్రమం తప్పకుండా ప్రతి ఏటా జగనన్న విద్యాదీవెన పథకం ఫీజు రీఎంబర్స్‌మెంట్, జగనన్న వసతిదీవెన కింద తల్లుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. అదేవిధంగా నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కా ర్పోరేట్ విద్యాసంస్దలకు ధీటుగా తయారుచేయడం జరుగుతోందన్నారు. కాగా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్ట ర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, మైనారిటీ సంక్షేమశాఖాధికారి కనకదుర్గాభవాని, మెప్మా ప్రాజెక్ట్ డైరక్టర్ రవీంద్ర, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్యతోపాటు విద్యార్దులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## త్రివర్ణపతాకంతో స్కేటింగ్ క్రీడాకారుల ర్యాలీ



**నెల్లూరు,ఆగస్టు11 ప్రభాతవార్త-విద్య** స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్బంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఆజాద్ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్కేటింగ్ క్రీడాకారులు త్రివర్ణపతాకాన్ని చేతబూని నగరంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు నిమ్మల వీర వెంకటేశ్వర్లు మాట్లాడుతు స్వ తంత్ర సమర యోధుల గాధలను వివరించారు. చిన్నారులు స్వతంత్ర యోధుల ఆశయసాధనకు కృషిచే యాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు గుర్రం ఈశ్వర్,కందుకూరు రమేష్, జావె ద్, భరత్, శౌకత్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పతాకాలు అందజేసిన కాకాణి



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11 ప్రభాతవార్త** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం నెల్లూరు కలెక్టరేట్‌లో పలువురికి జాతీయ పతాకాలు అందజేశారు. కలెక్టరేట్ ఆవరణంలోని తిక్కన ప్రాంగణంలో పలువురు మహిళలకు జాతీయ పతాకాలు అందజేసిన మంత్రి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మూడు రోజులపాటు ప్రతి ఇంటా జాతీయ పతాకాలు ఎగురవేయాలని వారికి సూచించారు.

## కలెక్టరేట్ వద్ద విఆర్‌ఏల ధర్నా




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11 ప్రభాతవార్త** న్యాయమైన తమ కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో విఆర్‌ఏలు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల వేతనాలు పెంచాలని..డిఏ రికవరీ ఆపాలని..నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఏలుగా నియమించాలన్నారు. రెవె న్యూ వ్యవస్దలో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న తాము కుటుంబాలతో సహ ఇబ్బందులు పడుతు న్నామన్నారు. దీనికితోడు గతంలో తీసుకున్న డిఏలను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించడంతో మరిం తగా ఇబ్బందులు పడుతున్నామన్న విఆర్‌ఏలు తమ వేతనం రూ. 26 వేలు చేయాలని..డిఏ రికవరీ ఉత్త ర్వులు ఆపి పాతపద్దతితోనే డిఏతో కూడిన వేతనం ఇవ్వాలని..ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ తమకు వర్తింప జేయాలని..నామినీలు పనిచేస్తున్నవారిని విఆర్‌ఏలుగా నియమించాలని..అర్హులైన విఆర్‌ఏలకు విఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ మేరకు నినా దాలు చేసిన విఆర్‌ఏలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్వో వెంకటనారాయణమ్మకు అందజేశారు.

## త్వరలో 54 డివిజన్లకు నూతన కమిటీల ఎంపిక



**నెల్లూరు,ఆగస్టు11 ప్రభాతవార్త-విద్య** నెల్లూరు కార్పొరేషన్ పరిదిలోని 54 డివిజన్లలో తమ పార్టీకి చెందిన నూతన నాయకత్వంతో కమిటీలను ఏర్పాటుచేయనున్నామని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు మ నుక్రాంత్ చెన్నారెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు నూతక కమిటీల ఏర్పాటుకు సంభందించిన బాధ్యతలను ఆయ న పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌కు అధికారికంగా అప్పగించారు. ఈ సందర్బంగా గురువారం నగరంలోని స్దానిక జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. నూతన కమిటీల ఏర్పాటు బాధ్యతలను నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌కు అప్ప గిం చామన్నారు. జిల్లాలో మొత్తంలో ఎంతో బలంగా ఉన్న నెల్లూరు నగర నియోజకవర్గంపై తమ అదిష్టానం ప్రత్యేక శ్రద్ద పెట్టిందన్నారు. ఇందులోభాగంగా నగరంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నామన్నారు. గతం లో నగర నియోజవర్గం నుండి ప్రజారాజ్యం పార్టీ ఎమ్మెల్యేగా ముంగమూరి శ్రీధర్‌కృష్ణారెడ్డి విజయం సాధిం చారని గుర్తుచేశారు. పార్టీకోసం కష్టపడిన వారికి ఈ నూతన కమిటీల్లో సముచిత స్థానం దక్కుతుందని ఆ యన పేర్కొన్నారు. అనంతరం నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతు జిల్లా అధ్యక్షుని ఆదే శాల మేరకు త్వరలోనే 54 డివిజన్లకు సంభందించి క్రియాశీలక సభ్యులతో సమావేశాలు నిర్వహించ ను న్నామని, అందరికి ఆమోదయోగ్యమైన సభ్యులను కమిటి అధ్యక్షులుగా ఎంపిక చేయటం జరుగుతుంద న్నారు. అలాగే పార్టీకోసం కష్టపడిని వారికి ప్రధమ ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. నగరంలోని మోగా అభిమానులు, పవన్ అభిమానులు, అందరికి ఏపతాటిపైకి తీసుకువచ్చి కమిటీల్లో స్దానం ఇవ్వనున్నా మ న్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించటమేలక్ష్యంగా విధులు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునుగుల కిషోర్, నాయకులు ప్రశాంత్‌యాదవ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## స్వంత నిధులతో బ్రాహ్మణ భవన్



**నెల్లూరురూరల్, ఆగష్టు11 ప్రభాతవార్త** ఏడాదిలోగా బ్రాహ్మణ అపర కర్మల భవనాన్ని పూర్తిచేసి ఆసమాజానికి అంకితమిస్తామని మాజీమంత్రి, సిటి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ అధికారులను ఆదేశిం చారు. గురువారం నగరంలోని మినిబైపాస్ శ్రీనివాస అగ్రహారం వద్ద సర్వేపల్లి కాలువ కట్టపై రూ.40లక్షల అంచనాలతో నూతనంగా నిర్మించనున్న బ్రాహ్మణ అపర క్రియల భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ, సర్వేపల్లి కాలువ లైనింగ్ పనులు జరుగుతున్నందున ఈప నులు ఆలస్యమయ్యాయని వివరించారు. కాలువ రిటైనింగ్ వాల్ ఏమేరకు వస్తుందో తెలిసిన అనంతరం ప్రస్తుతం ఈపనులను ప్రారంభించామన్నారు. వచ్చే జూన్ నాటికి భవనం వాడుకలోకి వస్తుందన్న అశా భావాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో విజయడెయిరీ చైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితర అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆజాదికా అమృత్‌మహోత్సవ ప్రదర్శన




**బుచ్చి ఆగష్టు 11 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో గురువారం ఉదయం ఆజాదికా అమృతమహోత్సవాలలో భాగంగా 75 మంది స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలు జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు.ఈకార క్యక్రమానికి ముఖ్య అతిధులుగారోటరీ గవర్నర్ ఒమ్మిన సతీష్, నెల్లూరు రోటరీ ప్రెసిడెంట్ కొండా శేఖర్‌రెడ్డి, సెక్రటరీ మహ్మద్ సమీఉల్లా, అతిధులుగా హాజరైయ్యారు.ఈ సందర్బంగా జాతీయ జెండా చిత్రలేఖన పోటీ,దేశనాయకుల క్విజ్ పాటల పోటీలలో గెలుపొందిన విద్యార్దులకు బహుమతులు అందజేశారు. రోటరీ గవర్నర్ సతీష్ మాట్లాడుతు నేటి మన స్వేచ్ఛకు కారణమైన దేశనాయకులను,వారి త్యాగాలను మనం మరవకూడదని అన్నారు.ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్, ఉపాధ్యాయులు,విద్యార్దులు పాల్గొన్నారు.